పేదలకు రక్ష.. 'సురక్ష'



తనకల్లు మండలం టీ.సదుంలో పౌష్టికాహార ప్రదర్శనను పరిశీలిస్తున్న అధికారులు



కదిరి మండల పరిధిలోని కదిరి కుంట్లపల్లిలో కళ్లద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్ అందజేస్తున్న దృశ్యం

ముదిగుబ్బ: మండల పరిధిలోని జొన్నలకొత్తపల్లి గ్రామంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య బృందం ఆధ్వర్యంలో చికిత్సలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అదే విధంగా కంటి చూపు సరిగా లేని వారికి చికిత్సలు చేశారు. కళ్ల అద్దాలను కూడా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, స్పెషలాఫీసర్ నరసింహమూర్తి, ఎంపీడీఓ విజయలక్ష్మి, డాక్టరు రాజేంద్ర, వైస్ ఎంపీపీ క్రిష్ణమ్మ వెంకటేశ్వర్‌రెడ్డి, మండల నాయకులు యోగానందరెడ్డి, ఉప సర్పంచ్ నారాయణస్వామి,సచివాలయ సిబ్బంది, మండల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

కదిరి కుంట్లపల్లి గ్రామంలో..

కదిరి అర్బన్: కదిరి కుంట్లపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ రజనీష్‌రెడ్డి, చలమకుంట్లపల్లి సర్పంచ్ నారపరెడ్డి, ఎంపీటీసీ కుమార్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రమీల, వినోద్‌కుమార్, కావ్య, రామాంజినేయులు తదితరులు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో ప్రభుత్వం అందజేసిన కంటి అద్దాలను రోగులకు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

తనకల్లు: మండల పరిధిలోని టీ.సదుంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ వైద్యులు ముబిషీరా, భాస్కర్‌నాయక్, శివ వివిధ రోగాలతో బాధపడుతున్న రోగులను పరీక్షించారు. అవసరమైన వారికి మందులను అందజేశారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు లక్ష్మీదేవి, జయమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శన ఆకట్టుకుంది. బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలు, చిన్నారులకు అంగన్‌వాడీ కేంద్రంలో ప్రభుత్వం సంతులిత ఆహారాన్ని పంపిణీ చేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో స్పెషలాఫీసర్ సూర్యనారాయణ, ఎంపీడీఓ పూల నరసింహులు, నాయకులు చిన్నపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు పెద్దకోట్లలో..

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ విజయలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్ రెడ్డి అధ్యక్షతన గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్య పరీక్షలు చేస్తామన్నారు. వైద్య చికిత్సలు అందించి, మందులు పంపిణీ చేస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని గ్రామస్తులకు సూచించారు.

నేడు దంపెట్లలో..

బత్తలపల్లి: మండల పరిధిలోని దంపెట్ల గ్రామంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సాయి మనోహర్, సర్పంచ్ చల్లా కరుణాకర్‌నాయుడు, వైస్ ఎంపీపీ గజ్జెల వెంగళరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు సచివాలయ ఆవరణలో జరగనున్న కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది బీపీ, షుగర్, రక్త, మూత్ర, కంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. పంచాయతీ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆరోగ్య సురక్షతో అందరికీ వైద్యం

కనగానపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలందరికీ ఉచితంగా వైద్య సేవలు అందుతున్నాయని ఈఓఆర్డీ అనిల్ కుమార్ తెలిపారు. సోమవారం దాదులూరులోని సచివాలయం వద్ద జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన 240 మందికి వైద్యులు వైద్య పరీక్షలు చేసి, మందులు పంపిణీ చేశారు. 12 మందిని శస్త్ర చికిత్సలకు సిఫార్సు చేసినట్లు పీహెచ్‌సీ డాక్టర్ చెన్నారెడ్డి తెలిపారు. కాగా ఈ వైద్య శిబిరాన్ని మధ్యాహ్నం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియాన్ సోలమాన్ తనిఖీ చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు ప్రశాంత్, చైతన్య, సుధీర్‌కుమార్, ఎంపీహెచ్ఈఓ మనోహర్, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పలువురు ఆరోగ్య, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ముదిగుబ్బ ఎస్ఐగా వంశీకృష్ణ



ముదిగుబ్బ: ముదిగుబ్బ ఎస్ఐగా వంశీకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇది వరకు ఇక్కడ ఎస్ఐగా పని చేస్తున్న హేమంత్‌కుమార్‌కు సీఐగా పదోన్నతి లభించింది. అనంతపురం ట్రాఫిక్‌లో విధులను నిర్వహిస్తున్న వంశీకృష్ణ ఇక్కడికు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలో శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

తనకల్లు ఎస్ఐగా రాజశేఖర్



తనకల్లు: స్థానిక పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా రాజశేఖర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర సరిహద్దులో గట్టి నిఘా ఏర్పాటు చేస్తామని తెలిపారు. కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణాతో పాటు గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్



పోలీసుల అదుపులో ఉన్న పేకాటరాయుళ్లు

ఓడీచెరువు: మండల కేంద్రానికి సమీపంలోని కంపచెట్ల కింద పేకాట ఆడుతున్న 10 మంది జూదరులను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. ముందుగా అందిన సమాచారం మేరకు.. కట్ట కింద తనిఖీలు చేపట్టగా వివిధ గ్రామాలకు చెందిన 10 మంది పేకాట ఆడుతూ పట్టుబడ్డారు. వారి నుంచి రూ.10,020 నగదు, 8 సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ రమణారెడ్డి, ప్రతాప్, నరేష్, లోకేష్, ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.

గాంధీ విగ్రహావిష్కరణ

గాండ్లపెంట: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాత కదిరి సురేష్ మెడికల్ స్టోర్ యజమాని రెడ్లపల్లి రామమోహన్‌శెట్టి ఆధ్వర్యంలో సోమవారం మహాత్మాగాంధీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం మధురాంబ ఆధ్వర్యంలో విగ్రహం ఏర్పాటు చేసిన దాతలు, వారి కుటుంబ సభ్యులను దుశ్శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో దాత కుటుంబ సభ్యులు, మాజీ సొసైటీ అధ్యక్షుడు వెంకటరమణారెడ్డి, పాఠశాల కమిటీ చైర్మన్ హరిప్రసాద్‌రెడ్డి, పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.


ఆర్థికసాయం అందజేత



గంగరాజు భార్యకు డబ్బు అందజేస్తున్న దృశ్యం

కదిరి టౌన్: పట్టణంలోని నిజాంవలీ కాలనీకి చెందిన గంగరాజు వారం రోజుల క్రితం జరిగిన ప్రమాదంలో తల, వెన్నెముకకు తీవ్ర గాయాలయ్యాయి. అతడు తిరుపతి స్విమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. 14వ వార్డు కౌన్సిలర్ మహబూబ్ బాషా, గంగరాజు స్నేహితులు ఆర్థికసాయం కోరుతూ సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టారు. ఫోన్ పే, గూగుల్ పే ద్వారా దాతలు పంపించిన రూ.1,05,000లను సోమవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం గంగరాజు భార్య సుస్మిత, అతడి బావ మురళిని పరామర్శించారు. డబ్బులు సహాయం చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో మహమ్మద్ రఫీ, ఆనంద్, వంశీ, మల్లి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా నీరు విడుదల



పుంగనూర్ బ్రాంచ్ కెనాల్‌కు నీరు విడుదల చేస్తున్న అధికారులు

కదిరి అర్బన్: మండల పరిధిలోని చెర్లోపల్లి రిజర్వాయర్ నుంచి పుంగనూర్ బ్రాంచ్ కెనాల్‌కు సోమవారం హంద్రీ-నీవా అధికారులు నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 1.2 టీఎంసీల నీరు ఉందన్నారు. ఇన్‌ఫ్లో కూడా వస్తోందన్నారు. రిజర్వాయర్ పూర్తిస్థాయి సామర్థ్యం 1.6 టీఎంసీలు అని తెలిపారు. కార్యక్రమంలో మదనపల్లి హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ రాజగోపాల్, డీఈలు వెంకటేశ్వర్లు, సురేంద్రనాథ్‌రెడ్డి, శ్రీదేవి, త్రివేణి, జేఈ పాండురంగ, శ్యామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రేపు రోడ్డు ప్రారంభోత్సవం

కదిరి అర్బన్: పట్నం గ్రామంలో రూ.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును ఈనెల 11వ తేదీన ఎమ్మెల్యే డా.పీవీ సిద్దారెడ్డి ప్రారంభించనున్నారని మండల కన్వీనర్ ప్రకాష్ సోమవారం పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, పార్టీ నాయకులు కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

పోలీసుల అదుపులో స్టార్టర్ల దొంగ

తనకల్లు: వ్యవసాయ మోటార్లకు అమర్చిన స్టార్టర్లను తీసుకెళ్తున్న దొంగను గ్రామస్తులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన ఘటన మండల పరిధిలోని రాచువారిపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డి వ్యవసాయ బోరుకు అమర్చిన స్టార్టర్‌ను ఉస్తినిపల్లికి చెందిన మస్తాన్‌వలి అనే యువకుడు దొంగతనంగా తీసుకెళ్లడానికి ప్రయత్నించాడు. అయితే గమనించిన గ్రామస్తులు అతడ్ని పట్టుకుని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పోలీసులకు అప్పగించారు. విచారణ చేసి కేసు నమోదు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.

శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి

బత్తలపల్లి: మండల కేంద్రంలో హిందూ శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు కమతం కాటమయ్య, మండల కార్యదర్శి బండల వెంకటేష్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. తహసీల్దార్ యుగేశ్వరీ దేవికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బత్తలపల్లిలో హిందూ శ్మశాన వాటికను కొందరు ఆక్రమించుకుంటున్నారన్నారు. ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు చేయాలంటే ఇబ్బందులు పడుతున్నారన్నారు. శ్మశాన వాటికకు స్థలం చూపాలన్నారు. అదే విధంగా మండలంలో అర్హులైన ప్రతి రైతు సర్వే నంబర్ రిజిస్ట్రేషన్ అయ్యే విధంగా జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు.

పంచాయతీల అభివృద్ధే లక్ష్యం



అమడగూరు: మాట్లాడుతున్న అధికారులు



ఓడీచెరువు: నివేదికలను వినిపిస్తున్న అధికారులు

పుట్టపర్తి అర్బన్: వచ్చే ఏడాది పంచాయతీల అభివృద్ధే లక్ష్యంగా అన్ని శాఖలు పని చేయాలి. ఇందుకు అనుగుణంగా అభివృద్ధి లక్ష్యాల నివేదికను సిద్ధం చేయాలని అధికారులు పేర్కొన్నారు. సోమవారం పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ ఏవీ రమణారెడ్డి అధ్యక్షతన అన్ని శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. 2023-24 పంచాయతీ అభివృద్ధి సూచికపై చర్చించారు. పంచాయతీలు అభివృద్ధి చెందాలంటే అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆయా శాఖలకు సంబంధించిన అభివృద్ధి లక్ష్యాల నివేదికలను ఈనెల 15లోపు ప్రభుత్వానికి అందజేయాలన్నారు. ఇక గతంలో చేసిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను సైతం నమోదు చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ నవీన్‌కుమార్, ఎంపీడీఓ నాగేశ్వరరెడ్డి, ఎంఈఓ ఖాదర్‌వలి, డాక్టర్ నాగదుర్గాదేవి, జ్యోత్స్న, హౌసింగ ఏఈ గౌస్‌మోదీన్, ఈఓఆర్డీ అశోక్‌కుమార్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఓడీచెరువు: మండల వ్యాప్తంగా ఉన్న పంచాయతీల అభివృద్ధికి కలసికట్టుగా కృషి చేద్దామని ఎంపీడీఓ వరలక్ష్మి పేర్కొన్నారు. సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఆదేశించిన మేరకు నిర్దేశిత సమయానికి నివేదికలు పంపాలని సూచించారు.

కొత్తచెరువు: మండలంలోని పంచాయతీల అభివృద్ధిపై సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పంచాయతీల అభివృద్ధి సూచికపై ఎంపీడీఓ బారన్‌సాబ్, ఈఓఆర్డీ సిద్దారెడ్డి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల వారీగా చేపట్టిన, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్షించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

అమడగూరు: గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఎంపీడీఓ మునెప్ప, ఈఓఆర్డీ నసీమా పేర్కొన్నారు. సోమవారం గ్రామ సచివాలయ సిబ్బందితో మండల పరిషత్ కార్యాలయంలో సమావేశాన్ని నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న పథకాలతో పాటుగా ఏడాది సమయానికి పంచాయతీల అభివృద్ధికి నివేదికలను తయారు చేయాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు 597 ప్రశ్నలకు సమాధానాలు సిద్ధం చేయాల్సి ఉందన్నారు.

అసాంఘిక కార్యకలాపాలు ప్రోత్సహిస్తే చర్యలు

బత్తలపల్లి: అసాంఘిక కార్యాకలాపాలను ప్రోత్సహిస్తే చర్యలు తప్పవని బత్తలపల్లి ఎస్ఐ పి.శ్రీనివాసులు హెచ్చరించారు. సోమవారం మండలంలోని అనంతసాగరం, మాల్యవంతం గ్రామాల్లో ఆయన సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా హోటల్స్, డాబాలు, కబాబ్ సెంటర్లు ఇతరత్రా వ్యాపార సముదాయాలను తనిఖీ చేశారు. మద్యం అమ్మకాలు, సేవించడం వంటి వాటిని నియంత్రించాలని సూచించారు. అలా ఎవరైనా చేసే అందుకు తగిన మూల్యం చెల్లించుకుంటారని హెచ్చరించారు. తమ వద్ద కేవలం తినడానికి మాత్రమే అనుమతులు ఉన్నాయని, మద్యం సేవించడానికి అనుమతులు లేవని సున్నితంగానే తిరస్కరించాలని సూచించారు. గొడవలకు దూరంగా ఉండాలని గ్రామస్తులకు సూచించారు. పేకాట, మట్కా అక్రమ మద్యంపై సమాచారం ఇవ్వాలని అలాంటి వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ద్విచక్ర వాహనాల్లో వెళ్లేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలను నడపరాదని హెచ్చరించారు.

పాసుబుక్కులు చేయలేదంటూ నిరాహార దీక్ష



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరాహార దీక్ష చేపట్టిన రైతు రాజారెడ్డి

ఎన్పీకుంట: తమ వ్యవసాయ పొలాలకు సంబంధించిన పాసుబుక్కులు చేయలేదంటూ కోటిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతు రాజారెడ్డి సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట తన తల్లి, భార్యతో కలిసి నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నంబర్లు 118, 119, 164, 113, 169, 168, 158లలోని తాతలకు సంబంధించిన సుమారు 30 ఎకరాల్లో తల్లి పేరిట నాలుగు ఎకరాలు, తన పేరిట రెండు ఎకరాలకు పాసుబుక్కులు చేయాలని అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు. గత మూడు సంవత్సరాలుగా తిరుగుతున్నా సమస్య పరిష్కారం కాలేదని వాపోయాడు. చాలాసార్లు స్పందనలో అర్జీలు ఇచ్చామని తెలిపారు. ఆర్డీఓ, డీఆర్‌ఓల దగ్గరికి వెళ్లినా సమస్య పరిష్కారం కాకపోవడంతో నిరాహార దీక్ష చేపట్టామని తెలిపారు. ఈ విషయంపై తహసీల్దార్ నరేంద్రకుమార్ వివరణ ఇస్తూ.. పూర్వీకుల ఆస్తికి సంబంధించి అన్నదమ్ముల మధ్య గొడవలు జరుగుతున్నాయన్నారు. ఇందుకు సంబంధించి కదిరి సివిల్ కోర్టులో ఓఎస్ నంబరు 285-2006 కేసు నడుస్తోందని తెలిపారు. ఇరువర్గాల వారికి నోటీసులు ఇచ్చి, బాధితుడు తెలిపిన సర్వేనెంబర్లలో క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి బాధితుడికి న్యాయం చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు జి.రమణ, సూర్యనారాయణ రెడ్డి, రైతు సంఘం నాయకుడు నరసింహులు నాయుడు లు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

సమన్వయంతో ముందుకెళ్లాలి

నల్లచెరువు: గ్రామాల అభివృద్ధికి అధికారులు సమన్వయంతో ముందుకెళ్లాలని ఎంపీడీఓ శకుంతల అన్నారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశం నిర్వహించారు. మండలంలో జరుగుతున్న పలు అభివృద్ధి పనులపై చర్చించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. గ్రామాల్లో నీటి, పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్యాధికారులు, ఏఎన్ఎంలు గ్రామాల్లోని ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. కార్యక్రమంలో ఏఓ రామకృష్ణ, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

హంద్రీ-నీవా ద్వారా చెరువులు నింపండి

కనగానపల్లి: మండలంలోని చెరువులను హంద్రీ నీవా కాలువ ద్వారా నీరు నింపాలని రైతు సంఘం నాయకులు అధికారులను కోరారు. దీనిపై సోమవారం స్పందనలో రైతు సంఘం నాయకులు తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘం నాయకులు గోవిందు, బాలరాజు మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా వచ్చే కృష్ణా జలాల ద్వారా చెరువులు నింపి రైతులు రబీ పంటలు సాగు చేసుకునేందుకు వీలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు ఈశ్వరయ్య, నాగరాజు పాల్గొన్నారు.

పీఆర్టీయూ మండల శాఖల ఏర్పాటు

ప్రశాంతి నిలయం: పీఆర్టీయూ పుట్టపర్తి, కొత్తచెరువు మండలాల నూతన శాఖలను ఏర్పాటు చేసినట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రజనీకాంత్ రెడ్డి తెలిపారు. సోమవారం కొత్తచెరువు మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో నూతన కార్యవర్గాలను ఎన్నుకున్నారు. పుట్టపర్తి మండల శాఖ అధ్యక్షుడిగా వై.నాగేంద్ర, ప్రధాన కార్యదర్శిగా ఏ.కేశవాచారి, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.మధు, ఉపాధ్యక్షుడిగా చెన్న కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అనిత, టి.గోపాల్ రెడ్డి, సూర్యనారాయణ, రత్నమ్మ, ఆదినారాయణ, రామాంజనేయులు తదితరులను ఎన్నుకున్నారు. కొత్తచెరువు మండల శాఖ అధ్యక్షుడిగా ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సి.అబ్దుల్ ఆజాద్, గౌరవ అధ్యక్షుడిగా కే.ఉదయ్ భాస్కర్‌రెడ్డి, ఇతర కార్యవర్గ సభ్యులుగా అక్కులప్ప, రామాంజనేయులు, వై.అనితా దేవి, జిల్లా కౌన్సిలర్లుగా ఏవీ రమణారెడ్డి, ఇర్షాద్ వలి, సోమ్లానాయక్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ సీనియర్ నాయకుడు బాబుసాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌తో మహిళలకు రక్షణ

బత్తలపల్లి: విద్యార్థి దశ నుంచి పిల్లల్లో నైతిక విలువలను నేర్పించాలని ఎస్ఐ పి.శ్రీనివాసులు అన్నారు. సోమవారం స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో మహిళా పోలీసుల ఆధ్వర్యంలో గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. విద్యార్థులకు గుణాత్మకమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలన్నారు. విద్యార్థుల్లో పఠనా నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. విద్యార్థులు పంచతంత్రం, బాలమిత్ర తదితర విజ్ఞానదాయకమైన పుస్తకాలు చదవాలని సూచించారు. అనంతరం పలు అంశాలపై విద్యార్థినులకు ప్రశ్నలు వేసి, పఠనా నైపుణ్యాలను పరిశీలించారు. అనంతరం గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు. అదేవిధంగా దిశ చట్టం మహిళలకు రక్షణ కవచంలా నిలుస్తుందని తెలిపారు. ప్రతి మహిళా తమ సెల్‌ఫోన్‌లో దిశ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వివరించారు. కార్యక్రమంలో హెచ్ఎం జయంతి పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్య పరీక్షలు

తలుపుల: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యాధికారులు మున్వర్‌బాషా, సల్మా ఆధ్వర్యంలో సోమవారం 62 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. వీరిలో 15 మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు గుర్తించారు.

బత్తాయిలో నల్లిని నివారించుకోండి



గొట్లూరు వద్ద చీనీతోటను పరిశీలిస్తున్న ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి

ధర్మవరం రూరల్: బత్తాయిలో ఆశించిన నల్లిని నివారించుకోవాలని ఉద్యానశాఖ అధికారిణి అమరేశ్వరి తెలిపారు. సోమవారం మండల పరిధిలోని గొట్లూరు వద్ద చీనీ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పంటకు నల్లి ఆశించినప్పుడు పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. పచ్చనల్లి ఇవి ఆకులపైన, కాయలపైన రసాన్ని పీల్చడం వల్ల నల్ల, చిన్న తెల్ల మచ్చలు ఏర్పడతాయన్నారు. అలాగే రెండవ రకం ఎర్రనల్లి, మంగునల్లి ఇది తొలి దశలో ముదురు ఆకులను ఆశిస్తుందని తెలిపారు. క్రమేణా కాయలను ఆశించి రసాన్ని పీల్చడం వల్ల కాయలు, ఊడ, వక్కపొడి రంగుకు మారతాయన్నారు. నల్లి నివారణకు ప్రోపర్‌గైట్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలుపుకుని పిచికారీ చేసుకోవాలన్నారు. లేదా స్పైరోమెసిఫిన్, డైకోపాల్, ఫెన్‌పూరాక్సిమేట్‌ను పిచికాకీ చేసుకోవచ్చని పేర్కొన్నారు. అవసరమైతే మళ్లీ 10 రోజులకు ఒకసారి పిచికారీ చేసుకుంటే నల్లి పూర్తిగా అంతరించి పోతుందన్నారు. అదే విధంగా వేపనూనె లీటర్ నీటికి 1 మి.లీ కలపి పిచికారీ చేసుకుంటే మంగునల్లిని నివారించుకోవచ్చన్నారు.

ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలు పెంచాలి

ధర్మవరం: ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని ఏఐవైఎఫ్ నాయకులు విన్నవించారు. ధర్మవరంలోని రైల్వేస్టేషన్‌లో సోమవారం స్టేషన్ మేనేజర్ చల్ల నరసింహనాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షుడు సకల రాజా మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుస్తున్న రైల్వేశాఖ ప్రయాణికులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తోందన్నారు. కరోనా సమయంలో నిలిపివేసిన ప్యాసింజర్ రైళ్లను పునః ప్రారంభించలేదన్నారు. దీంతో కేవలం ఎక్స్‌ప్రెస్ రైళ్లలో ప్రయాణికులు వెళ్లాలంటే ఎక్కువగా రిజర్వేషన్ బోగీలు ఉండటంతో సామాన్య ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జనరల్ బోగీలలో ప్రజలు ఒకరిపై ఒకరు నిలుచుని ప్రయాణం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఎక్స్‌ప్రెస్ రైళ్లలో జనరల్ బోగీలను పెంచాలని కోరారు. వందే భారత్ రైలులో టికెట్ ధరలను తగ్గించాలన్నారు. రైల్వే శాఖలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు జయ, లోకేష్, అరవింద్, త్రిలోక్ తదితరులు పాల్గొన్నారు.



విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో సోమవారం సీఎం వైఎస్ జగన్ అధ్యక్షతన జరిగిన వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, పీవీ సిద్దారెడ్డి, కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి.

జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక



సత్తా చాటిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తలుపుల: ఇటీవల ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో నల్లచెరువు మండల కేంద్రంలోని హైస్కూల్‌లో జరిగిన క్రీడా పోటీల్లో మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థులు అండర్-17, అండర్-14 బాలుర విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు శంకర, పీడీ మహేశ్వరి సోమవారం తెలిపారు. అండర్-17 వాలీబాల్ పోటీల్లో జావీద్, దేవేంద్ర, చరణ్ సత్తా చాటారన్నారు. త్రోబాల్‌లో షేక్షావలి, ఇర్ఫాన్, జావీద్ ప్రతిభ కనబరిచినట్లు తెలిపారు. కబడ్డీలో దేవేంద్ర, నందకిశోర్, అలాగే ఖోఖోలో దేవేందర్, బాల్ బాడ్మింటన్‌లో జావిద్, ఆఫ్రీన్, షణ్ముకసాయి సత్తా చాటినట్లు పేర్కొన్నారు. 100, 200, పోటీల్లో దేవేంద్రనాయక్, 400 మీటర్ల పోటీల్లో జావీద్ ఎంపికై నట్లు పేర్కొన్నారు. అండర్-14 విభాగానికి సంబంధించి వాలీబాల్ పోటీల్లో ఇమ్రాన్, లవదీప్, నవీద్ ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. త్రోబాల్‌లో ఇమ్రాన్ బాషా, లవదీప్, నవీద్, లోకేష్, షటిల్‌లో నవీద్, యోగాలో లోకేష్ సత్తా చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు.

అసైన్డ్ భూములకు హక్కులు కల్పించాలి

బత్తలపల్లి: రాష్ట్ర ప్రభుత్వం 2003 సంవత్సరానికి ముందు అసైన్డ్ భూములు పొందిన రైతులకు శాశ్వత హక్కు కల్పిస్తోంది. ఆ కోవలోనే తమకు శాశ్వత హక్కు కల్పించాలని పలువురు రైతులు తహసీల్దార్ యుగేశ్వరీదేవికి వినతి పత్రం అందజేశారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వన్‌టైం సెటిల్‌మెంట్ కింద పట్టాలు పొందిన కాలనీవాసులు తహసీల్దార్‌కు వినతిపత్రాలు అందజేశారు. ప్రభుత్వం 2003 సంవత్సరానికి ముందు అసైన్డ్ భూములు పొందిన రైతులకు శాశ్వత భూహక్కు కల్పించడంతో పాటు అమ్ముకునే వెసలుబాటు కల్పించిందన్నారు. అటువంటి భూముల వివరాలు వీఆర్‌ఓలు సేకరించి కలెక్టర్ కార్యాలయానికి నివేదికలు పంపించారన్నారు. అయితే తమ భూములు కొన్నింటిని మాత్రం వీఆర్‌ఓలు తమ లాగిన్‌లో లేవంటూ పంపలేదన్నారు. అదేమని అడిగితే మీ వివరాలు మా దగ్గర లేవని, లేని వాటికి మేము ఎలా వివరాలు సేకరిస్తామని సమాధానం ఇస్తున్నారన్నారు. అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగేలా చూడాలని, శాశ్వత భూహక్కు కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి ఇంటి పట్టాలు పొందిన తాము రూ.10 వేలు వన్‌టైం సెటిల్‌మెంట్ కింద చెల్లించామన్నారు. అమ్ముకునేందుకు రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్తే రిజిస్టరు కావని చెబుతున్నారని తెలిపారు. బ్యాంకులో రుణం పొందుదామని వెళ్లితే అక్కడా రుణాలు ఇవ్వడం లేదని చెప్పారు. ప్రభుత్వమే తమ సమస్యకు పరిష్కారం చూపాలంటూ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు